



భోగి మంటలు వెలిగిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

నంద్యాల (కల్చరల్), జనవరి 14: జిల్లాలో సంక్రాంతి ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. ఆదివారం 'భోగి' వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. పల్లెల్లో భోగి వేడుక సందడి బాగా కనిపించింది. పాత సామగ్రిని, పాత వస్తువులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. పాతకు స్వస్తి చెప్పి, భోగి మంటల వెలుగుల్లో కొత్త క్రాంతికి స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి, నైవేద్యాలు సమర్పించారు. భోగి భస్మాన్ని నుదుట ధరించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నువ్వులతో చేసిన సజ్జ రొట్టెలు ప్రసాదంగా స్వీకరించారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సిద్ధమయ్యారు. గ్రామ సీమల్లో ఇంటికి చేరిన కొత్త ధాన్యంతో చేసిన పిండి వంటలతో రైతులు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకోనున్నారు. కనుమ పండుగ రోజున పశువులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేయనున్నారు.





శ్రీశైలంలో గ్రామోత్సవం

పల్లె ఇంట.. భోగి పండుగ

- జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు
- సంప్రదాయం ఉట్టిపడేలా రంగవల్లులు
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు
- సంస్కృతిని గుర్తు చేసిన హరిదాసుల కీర్తనలు
- గ్రామ సీమల్లో పండగ సందడి



శ్రీశైలంలో మహిళల కోలాటం



మహానందిలో..



గ్రామోత్సవంలో ఆలయ సిబ్బంది



కళాకారుల ప్రదర్శన

ప్రకృతి వేడుక..సంక్రాంతి

ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటి చెబుతూ సంక్రాంతి వేడుక హేమంత రుతువులో వస్తుంది. సంక్రాంతి పర్వదినాల్లో రైతుల ఇండ్లలో ధాన్యం రాశులు చేరి, వారి బతుకంతా కాంతిమయం చేస్తుంది. అందరి కళ్లలో ఆనందాన్ని నిలుపుతుంది. నేలపై రంగవల్లికలు, నింగిపై గాలిపటాలు భువికీ దివికీ హరివిల్లు ద్వారాలను ఏర్పరచుతాయి. డూడూ బసవన్న అంటూ గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలు, జంగమదేవర నినాదాలు హృద్యంగా మనసును మీటుతుంటాయి. అటు పితృదేవతలను స్మరించుకోవడం, చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసి వారు చిరంజీవులుగా బాగుండాలని కోరుకోవడం, ఏడాదిపాటు తమకు సేవ చేసి, పాడిపంటలను అందించే పశువులకు కృతజ్ఞతా పూర్వకంగా సేవచేయడం ఈ సంక్రాంతి పండుగ ప్రత్యేకతలు.

మకర సంక్రాంతి అంటే...?

నెల రోజులపాటు కొనసాగిన ధనుర్మాసం ముగింపును గుర్తు చేస్తూ మకర సంక్రాంతి వస్తుంది. ప్రకృతిలోని సూర్యుడు దక్షిణార్థ గోళం నుంచి ఉత్తరార్థ గోళం వైపు పయనిస్తూ మకర రాశిలో ప్రవేశించడాన్నే మకర సంక్రాంతిగా వేడుక నిర్వహిస్తున్నారు. సంక్రాంతి అంటే సంక్రమణం అని అర్థం. అంటే చేరుకోవడం, మారడం అని పేర్కొంటారు. ఉత్తరాయణ పుణ్య కాలమైన సంక్రాంతి రోజున చేసే ఏ దానమైనా శ్రేష్ఠమైందిగా శాస్త్రం చెబుతోంది. అందుకే ఈ రోజున నువ్వులు, దుంపలు, ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, గోవులు దానం చేస్తే స్వర్గవాసం కలుగుతుందని పెద్దలు పేర్కొంటారు. అందుకే పల్లెల్లో గంగిరెద్దు ఆటగాళ్లు, జంగమదేవరలు, హరిదాసులు ఈ వేడుక రోజున ప్రత్యక్షమై, తమ హావభావ విన్యాసాలతో అలరించి, రైతులు ఇచ్చే వాటిని స్వీకరిస్తారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటలు చేతికొచ్చిన సమయం కనుక ఇది రైతుల పండుగ అయింది. అందుకే సంక్రాంతి రోజున రైతుల ఇండ్లన్నీ బంధువులు, కుటుంబ సభ్యులతో కళకళలాడుతుంటాయి. సంక్రాంతి పండుగ రోజున కొత్త ధాన్యంతో పొంగలి చేస్తారు. అలాగే వివిధ రకాల పిండి వంటలు ప్రత్యేకంగా తయారు చేస్తారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తారు.



భోగిపండ్లు పోసి ఆశీర్వదిస్తున్న అర్చకులు



ముందున్నవన్నీ మంచి రోజులే...

సూర్యుడు సంక్రాంతి నుంచి ఉత్తరాయన ప్రయాణం ఆరంభిస్తాడు. 'ఇక ముందున్నవన్నీ మంచి రోజులే' అని పెద్దలు అనే నానుడిలో ఒక అర్థం కనిపిస్తుంది. ఏడాదిలో దక్షిణాయనం కొనసాగిన ఆరునెలలు పగలు తక్కువగా ఉంటుంది. రాత్రి ఎక్కువ సమయం ఉండటంతోపాటూ చలిగాలులు, క్రిమి, కీటకాల బెడద ఉంటాయి. అయితే సూర్యుడు సంక్రాంతి రోజున 'మకర రాశి'లోకి ప్రవేశించింది మొదలు ఉత్తరాయన పుణ్యకాలం మొదలవుతుంది. ఈ కాలంలో పెళ్లిళ్లు, పేరంటాళ్లు, గృహ ప్రవేశాలు ఇతరత్రా శుభకార్యాలు చేసుకోవడానికి వీలవుతుంది. అన్ని పండుగలూ తిధుల ప్రకారం, తేదీ మార్పులతో వస్తుంటాయి. కానీ సంక్రాంతి ప్రతి ఏడాది జనవరి 14 లేదా 15 తేదీల్లోనే కచ్చితంగా ఉంటుంది. మకర సంక్రాంతితో ఉత్తరాయనం మొదలవుతుంది.

పశు సంపదను గుర్తు చేసేదే 'కనుమ పండుగ'

రైతులు తమ వ్యవసాయ పనులకు ఏడాదంతా ఆసరాగా నిలిచి ఉండే పశువుల కోసం 'కనుమ' పండుగ ఘనంగా నిర్వహిస్తారు. తమ ఇండ్లలోని గోవులు, బర్రెలు, ఎద్దులకు ఆరోజున శుభ్రంగా స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో వాటిని అందంగా ముస్తాబు చేస్తారు. పశు సంపదను మరింత అభివృద్ధి చేయాలని, తమ వ్యవసాయ పనులకు మరింత అండగా నిలవాలని వాటిని పూజిస్తారు. ఆరోజున ఎడ్లను అందంగా ముస్తాబు చేసి, గ్రామంలో తిప్పుతారు. ఎండ్లబండ్ల పందేలు, కోడి పందేలు, గాలి పటాల పందేలు నిర్వహిస్తారు.

రావణ వాహనంపై శివపార్వతులు

- నేడు పార్వతీ కళ్యాణం
- స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ



శ్రీశైలం, జనవరి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు రావణ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోక కళ్యాణం కోసం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్రపారాయణాలు, చతుర్వేద పారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణ వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ వెలుపలకు ఉత్సవానికి తోడ్కొని వచ్చి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, ఢమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి తరించారు. సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

- **నేడు స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ**

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం నంది వాహన సేవలో భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అలాగే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం విశేషంగా నిర్వహించనున్నారు. సంక్రాంతి బ్రహ్మోత్సవ కల్యాణానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది.

వైసీపీ నేత దౌర్జన్యం

- ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం
- ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తుండగా అడ్డుకున్న గ్రామస్తులు, రైతులు



ప్రభుత్వ భూమిలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపడుతున్న అధికార పార్టీ నేత

ప్యాపిలి, జనవరి 14: మండలంలోని ఓ వైసీపీ నేతల దౌర్జన్యానికి తెగబడ్డాడు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. మూడు రోజులుగా ఆ పొలంలో ఎక్స్‌కవేటర్‌తో చదును చేసే పనులను చేపట్టాడు. దీంతో సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు పనులను అడ్డుకున్నారు. మండలంలోని వెంగళాంపల్లి గ్రామంలో 371లో దాదాపు 40 ఎకారల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి కన్ను ఆ భూమిపై పడింది. ఎలాగైనా కొంత భూమిని ఆక్రమించు కోవాలనుకున్నాడు. దీంతో మూడు రోజులుగా ఎక్స్‌కవేటర్ పెట్టించి ఆ భూమిని చదును చేసే పనులను చేయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న ఆ గ్రామ రైతులు, ప్రజలు అంతా ఒక్కటయ్యారు. ఎలాగైనా పనులను నిలిపి వేయించాలని మాట్లాడుకున్నారు. దాదాపు వంద మంది రైతులు పొలం దగ్గరకు తరలి వెళ్లారు. పొలంలో అక్రమంగా నిర్వహిస్తున్న పనులను అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ వర్గానికి, రైతులకు వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం పనులను నిలిపి వేశారు. అయితే సదరు వైసీపీ నేత తన కుమారుడు ఆర్మీలో పని చేస్తున్నందున ప్రభుత్వం గ్రామంలోని 371 సర్వే నెంబరులో భూమిలో ఐదు ఎకరాలు ఇచ్చినట్లు చెబుతున్నాడు. ఈ ఘటనపై తహసీల్దారు చంద్రశేఖర్‌వర్మను వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని చెప్పారు. రెండు రోజుల క్రితమే పనులను నిలిపివేయాలని ఆదేశాలు కూడా సదరు వ్యక్తికి ఆదేశాలు పంపినట్లు ఆయన తెలిపారు.



ఇరువర్గాల వారికి సర్ది చెబుతున్న పోలీసులు

గోదాముల కొరత

- నిధుల లేమితో మరమ్మతుల జాప్యం
- శిథిలావస్థకు చేరిన గోదాములు
- ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ

పాణ్యం, జనవరి 14 : ఆరుగాలం పండించిన ధాన్యానికి సరైన గోదాముల వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు 8 ఉండగా వాటి ఆధ్వర్యంలో 55 గోదాములు ఉన్నాయి. నంద్యాలలో 15.54 ఎకరాలలో 15 గోదాములు, ఆళ్లగడ్డలో 18.23 ఎకరాలలో 7, డోన్‌లో 9.82 ఎకరాలలో 4, నందికొట్కూరులో 13.09 ఎకరాలలో 9, ఆత్మకూరు 11.01 ఎకరాలలో 7, బండిఆత్మకూరులో 5 ఎకరాలలో 5, బనగానపల్లెలో 24.12 ఎకరాలు, ఔకులో 5 ఎకరాలలో ఒకటి, కోవెలకుంట్లలో 19.60 ఎకరాలలో 5, పాణ్యంలో 4.22 ఎకరాలలో 2 గోదాములు ఉన్నాయి. వీటిలో పాణ్యంలో నాలుగేళ్ల క్రితం నిర్మించతలపెట్టిన గోదాము పైకప్పు ఇప్పటికీ పూర్తి కాలేదు. నంద్యాలలోని 7, ఆళ్లగడ్డ 3, నందికొట్కూరులోని 3, పాణ్యంలోని ఒక గోదాములు మరమ్మతుల కారణంగా ధాన్యం నిల్వ ఉంచడం లేదు. కాగా 55 గోదాముల్లో 49,740 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచడానికి వీలు కాగా మరమ్మతులు ఇతర కారణాలతో 13 గోదాములు ఖాళీగా ఉండి 7,870 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈ యేడాది గోదాముల మరమ్మతుల కోసం గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఈ ఏడాది రూ. 75 లక్షలతో ప్రతిపాదనలు పంపగా కేవలం నందికొట్కూరులోని గోదాము మరమ్మతుకు రూ. 10 లక్షలు ఈ ఏడాది మంజూరు చేసింది. మిగిలిన గోదాముల మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో గోదాముల రైతులకు అందుబాటులో ఉండడంలేదు. గోదాములు అందుబాటులో ఉన్నా ధాన్యం నిల్వ ఉంచుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. కొన్ని మార్కెట్ యార్డుల్లో రెండేళ్ల క్రితం ప్రారంభించిన గోదాముల నిర్మాణాలు పూర్తి కాలేదు. యార్డుల్లోని ధాన్యం ఆరబోత షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు ప్రాంతాలలో అధికంగా వరి పండించడంతో ధాన్యం గోదాముల కొరతతో ఎక్కడ నిల్వ ఉంచుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. చిన్న, సన్నకారు రైతులు ధాన్యం నిల్వ ఉంచుకోలేక, సరైన ధరలేక అమ్ముకోలేక నానా యాతన పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ గోదాములను రైతులకు అందుబాటులో ఉండేలా నిధులు కేటాయించి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



నంద్యాలలో శిథిలావస్థకు చేరిన వ్యవసాయ మార్కెట్ గోదాములు

ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు, సంస్థలకు..

జిల్లాలోని 55 వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో ప్రభుత్వ శాఖలకు 18, ప్రైవేటు లైసెన్స్ ట్రేడర్స్‌కు 5 గోదాములు కేటాయించారు. వీటిలో నంద్యాలలో ప్రభుత్వ శాఖలకు 3, ప్రైవేటు సంస్థలకు 3, ఆళ్లగడ్డలో ప్రైవేటుకు ఒకటి, డోన్‌లో ప్రభుత్వ శాఖలకు 4, నందికొట్కూరులో ప్రభుత్వ శాఖలకు5, ఆత్మకూరు, బండిఆత్మకూరులో ప్రభుత్వ శాఖలకు 5, ప్రైవేటుకు ఒకటి, కోవెలకుంట్లలో ప్రభుత్వ శాఖకు ఒకటి కేటాయించారు.

రూ.75 లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదనలు

జిల్లాలోని ఏడు మార్కెట్ యార్డుల పరిధిలో 55 వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు ఉన్నాయి. వీటిలో 13 గోదాముల మరమ్మతులకు రూ.75 లక్షలతో ప్రతిపాదనలు పంపగా నందికొట్కూరులోని రెండు గోదాములకు రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. పాణ్యంలో రెండు గోదాములు ఉండగా ఒకటి పని చేస్తున్నది. 1500 టన్నుల సామర్థ్యంతో రూ. లక్షలతో నిర్మిస్తున్న గోదాము పైకప్పు పనులు పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న 40 గోదాముల్లో 41,870 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. రైతులు బస్తాకు రూ. 2లు అద్దె, రూపాయి బీమా చెల్లించాల్సి ఉంటుంది. నంద్యాలలోని 7 గోదాములు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వీటి స్థానంలో కొత్త నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. -ఏ. రహమాన్, ఏడీఎం, నంద్యాల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ

మిగిలిన 23 గోదాముల్లో రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవాల్సి వస్తోంది.

సౌకర్యాల లేమితో ప్రైవేటు గోదాములకు

ప్రభుత్వ గోదాముల్లో సరైన వసతి, సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ప్రైవేటు గోదాములను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 9, 83, 492 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 198 ప్రైవేటు గోదాములు ఉన్నాయి. కాగా ఈ గోదాముల్లో నిల్వ ఉంచిన ధాన్యానికి బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తుండడంతో రైతులు ప్రైవేటు గోదాములపై ఆసక్తి చూపుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముల్లోని ధాన్యానికి బస్తాకు రూ. 3లు అద్దె, ఒక రూపాయి బీమాకు వసూలు చేస్తుండగా ఈ యేడాది అద్దె రూ2కు తగ్గించినా రుణాల సౌకర్యం లేకపోవడంతో రైతులు రెండు రూపాయలు అధికంగా చెల్లించి ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ గోదాముల్లో సరైన సౌకర్యాలు లేకపోవడమే ఇందుకు కారణమని తెలిసింది. కాగా ప్రైవేటు గోదాముల్లోని ధాన్యం బస్తాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

రైతులకు గోదాముల కొరత తీర్చాలి



రైతులకు గోదాముల కొరత తీర్చాలి. ధాన్యాన్ని అత్యవసర సమయంలో నిల్వ ఉంచుకోవడానికి గోదాములు లేకపోవడంతో రైసు మిల్లు, ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచుకోవాల్సి వస్తోంది. ధాన్యం ఆరబోసుకోడానికి స్థానిక యార్డులో అవకాశం ఉన్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాణ్యంలో రెండు గోదాములు ఉన్నా ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ఇసుక డంపింగ్ యార్డుగా మార్చి రైతులకు సమస్యగా మార్చింది. దీంతో ధాన్యం రోడ్లపై, ప్రైవేటు స్థలాల్లో ఆరబోసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం గోదాములను నిర్మించి రైతుల ఇబ్బందులు తొలగించాలి.

-చాకలి రాముడు, రైతు పాణ్యం

వైసీపీ కీడు పోవాలని భోగి మంటలు

● వివిధ జీవో ప్రతులను దహనం చేసిన టీడీపీ నాయకులు

● బాబు నవశకానికి నాంది పలకాలని పిలుపు


జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న గౌరు దంపతులు


కలెక్టరేట్ ముందు భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కల్లూరు, జనవరి 14: రాష్ట్ర ప్రజలకు పట్టిన వైసీపీ కీడు తొలగిపోయి, చంద్రబాబు ఆధ్వర్యంలో నవశకం ఆరంభం కావాలని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం స్థానిక మాధవీనగర్‌లోని గౌరు నివాసంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ శ్రేణులతో కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలను మోసగించి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రతులను భోగి మంటల్లో గౌరు దంపతులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, జిల్లా కార్యదర్శి కేతూరు మధు, పాణ్యం మైనార్టీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలతో నిరసన

కర్నూలు(కలెక్టరేట్)/ (ఎడ్యుకేషన్): పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, డీఎస్సీ ప్రకటించాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల, విద్యార్థి సంఘాలు ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ముందు భోగిమంటల్లో వివిధ జీవోల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వారు పేర్కొన్నారు. 12వ పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల మొదటి పని రోజున జీతం ఇవ్వాలని కోరారు. ఇందులో ఏపీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

డీఎస్సీ నోటిఫికేషన్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తూ నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తుందని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆదివారం వివిధ జీవో ప్రతులను భోగిమంటల్లో కాల్చివేసి నిరసన తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర అధ్యక్షుడు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

కర్నూలు(హాస్పిటల్): భోగి మంటల్లో ఎస్మా ప్రతులు దహనం చేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీ వర్కర్లు భోగి పండుగ కూడా చేసుకోకుండా సమ్మెలో పాల్గొన్నారు. భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకే దీక్ష శిబిరం వద్ద రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలను ఏర్పాటు చేసి ఆ మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, నాయకులు సుధాకరప్ప, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు మహ్మద్ రఫీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయభారతి, మహేశ్వరి, విజయలక్ష్మి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదలాలి

నంద్యాల (నూనెపల్లె): వైసీపీ పాలనతో రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని పారదోలాలని నంద్యాలలో టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి, కౌన్సిలర్ దూదేకుల జైనాబీ, బీసీ సాధికార కమిటీ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి ఆదివారం టీడీపీ కార్యాలయం ఆవరణలో భోగి సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ కీడు తొలగి ఏపీ వెలగాలని నినాదంతో భోగి మంటలు వేశారు.




భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


నంద్యాలలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో...

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


లోకేష్ (ఫైల్)

మద్దికెర, జనవరి 14: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మొలగవల్లి లోకేష్ (25) ఆదివారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన శివరాముడు, శ్రీదేవి దంపతులది వ్యవసాయ కుటుంబం. లోకేష్ డిగ్రీ పూర్తి చేసి సైన్యంలో చేరేందుకు ప్రయత్నాలు చేశాడు. అలాగే గవర్నమెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఉద్యోగం రాకపోవడంతో కర్నూలులోని ప్రైవేట్ ఫ్యాక్టరీలో చేరాడు. ఎన్నేళ్లయినా ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో లోకేష్ తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మిత్రులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. చెట్టంత కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదన అందరినీ కదలించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దేవనకొండ, జనవరి 14 : సంక్రాంతి పండుగ వేళ ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. చిరంజీవి గౌడ్ (23) తన మిత్రుడు బాలకృష్ణతో కలిసి హైదరాబాద్ నుండి సొంతూరు బంటుపల్లికి బైక్‌పైన వస్తుండగా కర్నూలు-బళ్లారి రహదారిపై వీరంపల్లి స్టేజీ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరంజీవి గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరు హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఓబులేసు, కిష్టమ్మ దంపతులకు చిరంజీవి ఒక్కడే కుమారుడు. అతని మరణంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఓర్వకల్లు, జనవరి 14: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన కౌలు రైతు గిరిగారి శ్రీనివాసరెడ్డి (53) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. కొమరోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఎనిమిది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు పండించేవాడు. ఐదేళ్లుగా వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు చేతికి రాలేదు. దీంతో పెట్టుబడుల కోసం చేసిన రూ.9 లక్షల అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఇందిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు నగరానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 14: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా విక్టర్ ప్రసాద్ సోమవారం నగరానికి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతపురం నుంచి బయలుదేరి సాయంత్రం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం నంద్యాల జిల్లాకు వెళ్తున్నట్లు సమాచారం.

కన్నుల పండువగా గోదాదేవి కళ్యాణం


అహోబిలంలో గోదాదేవికి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 14: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం ప్రహ్లాదవరదస్వామి, గోదాదేవి అమ్మవారికి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి గోదాదేవికి అభిషేకం నిర్వహించిన అనంతరం, దిగువలో ప్రహ్లాదవరదస్వామి, గోదాదేవి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు.

నేడు ప్రధాని జన్‌మన్ ముఖాముఖి

● గిరిజనులతో చర్చించనున్న మోదీ


పాఠశాల సిబ్బందికి సూచనలు అందిస్తున్న మోటో మేనేజరు

పాణ్యం, జనవరి 14 : గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి జన్‌మన్ ముఖాముఖి కార్యక్రమం బలపనూరు పరిధిలోని గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీ మోటో మేనేజరు ఆర్‌జె కచప్, నంద్యాల జిల్లా డీటీడబ్ల్యూఓ వెంకటశివప్రసాద్, ఈఈ లత పాఠశాలలో ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు పరిశీలించారు. పాఠశాల సిబ్బందికి పలు సూచనలు అందించారు. ప్రత్యక్ష ప్రసారానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ ప్రదీప్, మేనేజరు గుండాల్ నాయక్, ప్రిన్సిపాల్ మేరీసలోమి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రారంభమైన స్వచ్ఛ తీర్థ


స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో చైర్మన్, ఈవో

శ్రీశైలం, జనవరి 14: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృత పారిశుధ్య చర్యలు చేపట్టామని ఈ నెల 21 వరకు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చైర్మన్, ఈవో క్యూకాంప్లెక్స్, తదితర పరిసరాలు శుభ్రం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ హెచ్.జి వెంకటేష్, పారిశుధ్యపు సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి


ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ రావు

శ్రీశైలం, జనవరి 14: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జిని వేదపండితులు ఆశీర్వదించారు.

బైకుల దొంగ అరెస్టు

మంత్రాలయం, జనవరి 14: మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసినట్లు మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. కర్ణాటకలోని రాయచూరు జిల్లా మఠమారి గ్రామానికి చెందిన ముల్లా మైనుద్దీన్ పార్కింగ్ చేసిన బైకులను అపహరిస్తున్నాడని తెలిపారు. మాధవరం చెక్‌పోస్టు వద్ద వాహనాలు పోలీసులు తనిఖీ చేస్తుండగా మైనుద్దీన్ పట్టుబడ్డాడని, అతని వద్ద నున్న మూడు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు


శ్రీమఠం మధ్వమార్గ్ కారిడారులో భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

మంత్రాలయం, జనవరి 14: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సంక్రాంతి భోగి సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారాయి. భక్తులు రథోత్సవాలలో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

ఈక్రాప్ నమోదును వేగవంతం చేస్తున్నాం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 14: ప్రస్తుత రబీ సీజన్‌లో కర్నూలు జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేశామని, తుది జాబితాను మార్చి నెల 5లోపు ప్రకటించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. ప్రస్తుత రబీలో నూరు శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఈక్రాప్‌లో ప్రత్యేకంగా నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారన్నారు. పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందేందుకు ఈకేవైసీతో పాటు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయించాలన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తామని జేడీ వరలక్ష్మి తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తిరుణాలను ప్రశాంతగా జరుపుకోవాలి

పగిడ్యాల, జనవరి 14: మండలంలోని పడమర ప్రాతకోట, తూర్పు ప్రాతకోట గ్రామంలో తిరుణాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఆయా గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథోత్సవం సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుణాలలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుకు అవసరమైన చర్యలపై ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. రికార్డింగ్ డ్యాన్స్‌లకు అనుమతులు లేవని వారికి సూచించారు. ఎద్దుల పోటీలు, కబడ్డీ పోటీలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ జయశేఖర్, ఆయా గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటనాథుడి కల్యాణం


స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం

ఆత్మకూరు రూరల్, అక్టోబర్ 14: ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలోని చెన్న కేశవస్వామి ఆలయంలో వేదపండితులు శేషఫణి శర్మ, శంకరశర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ప్రతి ఏటా కరివేన గ్రామంలో 3 రోజుల పాటు నిర్వహించే తిరుణాల వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ముందుగా చెన్నకేశవస్వామి ఆలయంలో మూల విరాట్టుకు అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

టీడీపీ నాయకుడి పరామర్శ

పాములపాడు, జనవరి 14 : మండలంలోని వేంపెంట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ గాండ్ల క్రిష్ణుడుని నందికొట్కూరు నియోజకవర్గం మాజీ టీడీపీ ఇన్‌చార్జి బండి జయరాజ్ పరామర్శించారు. ఆదివారం టీడీపీ నాయకులు ఆదిరెడ్డి, పెద్ద రాజ్, చంద్రగౌడ్ ఇంటి వెళ్లి ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు.

రైళ్లలో పోలీసుల తనిఖీ


రైలులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ జలీల్‌బాషా

నంద్యాల క్రైం, జనవరి 14 : రైళ్లలో పోలీసులు ఆదివారం తనిఖీ నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, చోరీలు చోటుచేసుకోకుండా ప్రయాణికుల భద్రత కోసం తనిఖీలు చేపట్టామని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.జలీల్‌బాషా తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్నామన్నారు. అలాగే రైళ్లలో ఎలాంటి అక్రమ రవాణా లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



వెలుగోడు, ఆత్మకూరు, మహానంది మండలాల్లో జీవో ప్రతులను భోగి మంటలో దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం

● కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె ● పండగలోనూ నిరసన హోరు

ఊరంతా సంక్రాంతి శోభ కనిపిస్తున్నా అంగన్‌వాడీల కుటుంబాల్లో పండగ లేదు. సీఎం జగన్ తమను పండగకు దూరం చేశారని అంగన్‌వాడీ కార్యకర్తలు విమర్శించారు. 34 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో కొంచెం కూడా చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని కోరినా లాభం లేకుండా పోయిందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు.

బండిఆత్మకూరు, జనవరి14 : భోగి పండుగ రోజు కూడా అంగన్వాడీలు తమ దీక్ష కొనసాగించారు. బండిఆత్మకూరులో ఉదయాన్నే శిబిరం వద్దకు చేరుకుని భోగి మంటలు వేసి జీవో రెండు ప్రతులను తగులబెట్టారు.

మహానంది: కనీస వేతనం పెంచకుండా పండగపూట ఆందోళనా శిబిరంలో ఉండేలా చేసిన సీఎం జగన్‌కు ఆడపిల్లల ఉసురు తప్పక తగులుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. ఆదివారం మహానంది మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు 34వ రోజు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం ఇటీవల తమకు పంపిన షోకాజ్ నోటీసుల పత్రాలను కార్యాలయం ముందు వేసిన భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు జ్యోతి ఉషారాణి, ఖైరూన్‌బీ, పాతిమామేరిరాణి, వకులాదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

పగిడ్యాల: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారించాలని కోరుతూ పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్మా పత్రాలను ఆదివారం భోగి మంటలలో దహనం చేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాములమ్మ, సీఐటీయూ జిల్లా నాయకుడు భాస్కరరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

ఆత్మకూరు రూరల్: అంగన్‌వాడీలు చేపడుతున్న దీక్షలు కొనసాగుతున్నాయి. 34 రోజైన ఆదివారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని నిరసన దీక్షా శిబిరం వద్ద భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నాయకులు రామ్‌నాయక్, రణధీర్ మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధనకై అంగన్‌వాడీలు 34రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం జగన్ స్పందించకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి స్వాములు,వ్యకాసం నాయకులు స్వాములు, ఆ సంఘం నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, ప్రమీల, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించి, వారిపై ప్రయోగించిన ఎస్మాను రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు నాగేశ్వరరావు, రామ్‌నాయక్, సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం జీవో నంబర్ 2ను రద్దు చేసి అంగన్‌వాడీలపై ఎస్మాను రద్దు చేయాలని సీపీఎం కార్యాలయ ఆవరణలో పట్టణ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేశారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 34వరోజుకు చేరుకుంది, ఆదివారం భోగి పండుగ సందర్భంగా అంగన్‌వాడీలు ఎస్మాచట్టం ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల క్రిష్ణ అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు మదార్‌బీ, ఉమాదేవి, శాంతికుమారి, హరిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందేనని జిల్లా ఆఫీస్ సహాయ కార్యదర్శి నిర్మలమ్మ, రమణమ్మ అన్నారు. ఆదివారం గోస్పాడులో నిరవధిక దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ గత 34 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించడం లేదని, దీనికి తగిన మూల్యం త్వరలోనే చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో సువర్ణ, భాగ్యలక్ష్మి, చంద్రలీలా, భూ లక్ష్మి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు అంగన్‌వాడీల సత్తా ఏమిటో చూపిస్తామని ఆ సంఘం జిల్లా నాయకురాళ్లు హరిత, మండల నాయకురాళ్లు నాగమణి, రమణమ్మ అన్నారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు తమ సమస్యల పరిష్కారానికి చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శ్రీదేవి, ప్రభావతి, పద్మావతి, సుభాషిణి, వసంత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఎస్మా జీవో తీసుకురావడం దుర్మార్గమని అంగన్వాడీలు మండిపడ్డారు. జూపాడుబంగ్లాలోని తహసీల్దార్ కార్యాలయం ముందు భోగిమంటలు వేసి జీవో ప్రతులను కాల్చివేశారు.

వెలుగోడు : వేతనాలు పెంచే వరకు నిరసన దీక్షలు కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తెలిపారు. ఆదివారం వెలుగోడు పట్టణంలో నిరసన దీక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలలో జీవో నెంబర్ 2 పత్రులను వేసి నిరసన తెలిపారు.

పాములపాడు: పాములపాడులో ప్రజాసంఘాల నాయకులతో కలిసి జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదన్నారు అంగన్వాడీలు, హెల్పర్స్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో...


పగిడ్యాలలో..


కొత్తపల్లిలో...









భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

నంద్యాల టౌన్, జనవరి 14: వైసీపీ ప్రభుత్వం తెచ్చిన భూ హక్కు చట్టాన్ని, జీవో నంబరు 512ను రద్దు చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలీం నగర్‌లో జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్నలు మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు నిర్ణయం మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన నీతిఅయోగ్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. న్యాయనిపుణులు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, హై కోర్టు స్టే విధించినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం లెక్క చేయకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, కలాం, మజీద్, రాము, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జీవో నంబరు 152 కాపీలను ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలానీ, గిరిజన సమాఖ్య నాయకుడు నరసింహ, శేఖర్, బాష, అబ్దుల్ హుసేని, మౌలా తదితరులు పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలకాలి

నంద్యాల టౌన్, జనవరి 14: స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా సంక్షేమం కోసం పని చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అతావుల్లాఖాన్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాలలోని ఎస్‌డీపీఐ కార్యాలయంలో రాష్ట్రంలోని 6 నియోజకవర్గాలకు మొదటి విడతలో ఎస్‌డీపీఐ అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా అతావుల్లాఖాన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎస్‌డీపీఐ పోటీ చేస్తుందని పేర్కొన్నారు. మొదటి విడతలో నంద్యాల అసెంబ్లీకి ఫాజిల్ దేశాయ్, శ్రీశైలం అసెంబ్లీకి ఎన్‌కే యూనస్, నందికొట్కూరు అసెంబ్లీకి లింకన్‌రాజు, కర్నూలు అసెంబ్లీకి షేక్ జహంగీర్ అహమ్మద్, ఎమ్మిగనూరు అసెంబ్లీకి అబ్దుల్ ఖాదర్, నెల్లూరు రూరల్ అసెంబ్లీకి సయ్యద్ ఫాజిల్‌ను ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇలియాస్ కుంబ్లే, రాష్ట్ర ఇన్‌చార్జీ అబ్దుల్ సత్తార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల ఇన్‌చార్జీ అబ్దుల్ బేగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ పాల్గొన్నారు.




వైసీపీ దరిద్రం పోవాలి


భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, జనవరి 14: రాష్ట్రానికి వైసీపీ దరిద్ర పాలన వీడి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆత్మకూరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం స్థానిక గౌడ్ సెంటరులో భోగి మంటల వైసీపీ చెత్త నిర్ణయాల ప్రతులను దహనం చేశారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ సుమారు ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారని తెలిపారు. సైకో జగన్ తీసుకున్న చెత్త నిర్ణయాలతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబేయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాబోతోందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లాపురం బాషా, రామ్మూర్తి, సోము, సుబ్బరాజు, మురళి, కొయ్య హోటల్ మున్నా తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన చీకటి జీఓలను నందికొట్కూరు టీడీపీ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు భోగి మంటల్లో వేసి నిరసనలు వ్యక్తం చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు బండి జయరాజు, షకీల్ అహ్మద్, మల్లికార్జున రెడ్డి, జయసూర్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిని బలపరిచి వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, మద్దిలేటి, వడ్డె శ్రీను, ఎల్లయ్యఆచారి తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో జీఓల ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న నాయకులు

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న గౌరు చరిత

పాణ్యం, జనవరి 14 : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా కబడ్డీ క్రీడలు ఆదివారం ముగిశాయి. క్రీడా విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గడివేముల, జనవరి 14: పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని టీడీపీ నాయకుడు అబ్దుల్‌ఖాలిద్‌బాషా అన్నారు. సంక్రాంతి సందర్భంగా బిలకలగూడురు గ్రామంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దౌలత్‌బాషా, నారాయణ పాల్గొన్నారు.

18న బీసీల రథయాత్రను జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు, జనవరి 14: ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీసీల సమస్యల సాధన కోసం 18 నుంచి చేపట్టే రథయాత్రను అత్యధిక సంఖ్యలో బీసీలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామిగౌడ్, బాలస్వామి యాదవ్ కోరారు. ఈ మేరకు హలో బీసీ ఛలో ఆత్మకూరు పేరిట చేపడుతున్న ఈ రథయాత్ర కరపత్రాలను ఆదివారం ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రామకృష్ణ, శ్రీహరి, వీరన్న, నాగరాజు, డీలర్ రమణ, పెద్దన్న, వెంకటేశ్వర్లు, రాము, గౌడ్, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విరాళం


ఈఓకు వెండి నాగపడగను అందజేస్తున్న భక్తులు

పాణ్యం, జనవరి 14: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు.. ఆదివారం కర్నూలు రాజీవ్‌నగర్‌కుచెందిన కె. బ్రహ్మేశ్వరయ్య ఆచారి కుమారుడు డాక్టర్ వినోద్‌ఆచారి స్వామివారికి కిలో 149 గ్రాములు వెండి నాగపడగను, హైదరాబాదుకు చెందిన కె. సుబ్బయ్య కుమారుడు రామనరసింహ ఆలయ అన్నదానానికి రూ. 1. 50 లక్షలు అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వీరయ్యస్వామి, సురేష్ శర్మ, నారాయణ శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

నంద్యాల (కల్చరల్), జనవరి 14: పట్టణంలోని పలు దేవాలయలాలలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సంజీవనగర్ కోదండ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య ఆధ్వర్యంలో ఆదివారం తిరుప్పావై వ్రత పరిసమాప్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు రవి శంకర శర్మ, తరుణ్ శర్మల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో కళ్యాణం నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశివాసు, మహిళామండలి ఆధ్వర్యంలో, క్రాంతి నగర్ కోదండ రామాలయంలో, పద్మావతి నగర్‌లో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో నిర్వాహకులు విజయచంద్రుడు ఆధ్వర్యంలో గోదాసమేత రంగనాథ స్వామి కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

'ఎస్మా' ప్రయోగం దుర్మార్గం

● డిమాండ్లు నెరవేరే దాకా సమ్మె ఆగదు ● భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు ● 34వ రోజు కొనసాగిన సమ్మె


డోన్‌లో ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న అంగన్‌వాడీలు


డోన్‌లో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని అంగన్‌వాడీలు అన్నారు. వారు చేపట్టిన సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు భయపడబోమని, డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నోటీసులను భోగి మంటల్లో కాల్చి నిరసన తెలిపారు.

డోన్(రూరల్), జనవరి 14: అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన ఎస్మా చట్టాన్ని నిరసిస్తూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు 34వ రోజుకు చేరుకుంది. ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పాతబస్టాండులో అంగన్‌వాడీలు జీవో 2 ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. వారు చేపట్టిన సమ్మె 34వ రోజు కొనసాగింది.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం శిబిరంలో భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించే దాకా సమ్మె కొనసాగిస్తామన్నారు.

శిరివెళ్ల: డిమాండ్లను నెరవేర్చకుండా ప్రభుత్వం ఎన్ని ఉత్తర్వులు ఇచ్చినా తలొగ్గేది లేదని అంగన్‌వాడీలు హెచ్చరించారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న నిరవధిక సమ్మెలో 34వ రోజు ఎస్మా చట్టం ప్రతులు, నోటీసులను భోగి మంటల్లో వేసి ఆదివారం దహనం చేశారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోవడం దారుణమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఆదివారం చాగలమర్రి అంబేద్కర్ విగ్రహం ఎదుట రహదారిపై అంగన్‌వాడీలు, టీడీపీ నాయకులు కలిసి ఎస్మా చట్టం అమలు చేస్తూ ఇచ్చిన జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు అనిఫ్, అజీమ్, గఫార్, అబ్దుల్లా, జిలేబి షరీఫ్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట్ర ప్రభుత్వం పంపిన షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి అంగన్‌వాడీలు దహనం చేశారు. భోగి మంటల చుట్టూ నృత్యం చేస్తూ పాటలు పాడుతూ నిరసన తెలిపారు. అణచివేయాలని చూస్తే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. లక్షలాది రూపాయలు ప్రభుత్వ సొమ్మును జీతాలు తీసుకుంటూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్న ప్రభుత్వ సలహాదారులకు, మంత్రులకు తమ ఆవేదన పట్టలేదని విమర్శించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు పండగ రోజు కూడా సమ్మెను కొనసాగించారు. మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం భోగి మంటలు వేసి వాటిలో షోకాజ్ నోటీసుల ప్రతులను కాల్చి వేశారు. వేతనాలు పెంచినరోజే తమకు అసలైన పండుగ వచ్చినట్లు భావిస్తామని స్పష్టం చేశారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది ఆదివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వినూత్న నిరసన చేపట్టారు. 34 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్‌వాడీలు ఎస్మా పత్రాలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు.

బనగానపల్లె: భోగి పండుగ రోజు కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం బనగానపల్లెలో భోగిపంటలు వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్మా చట్టానికి అమలు చేస్తూ తెచ్చిన జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి కాల్చివేశారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా సమ్మె ఆగదని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు.

సంజామల: సంజామల మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఎస్మా చట్టాన్ని నిరసిస్తూ జీవో ప్రతులను భోగి మంటల్లో తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. సంజామలలోని సహకార బ్యాంక్ ఆవరణలో చేపట్టిన సమ్మె 34వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


దొర్నిపాడులో..


శిరివెళ్లలో..


చాగలమర్రిలో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు, అంగన్‌వాడీలు


ఆళ్లగడ్డలో..


ఉయ్యాలవాడలో మోకాళ్లపై నిరసన


బనగానపల్లెలో..


సంజామలలో..


బేతంచెర్లలో..


రుద్రవరంలో భోగి మంటలు వేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

'చంద్రబాబుతోనే పేదలకు న్యాయం'


ముత్యాలపాడులో టీడీపీ మేనిఫెస్టోను అందజేస్తున్న నాయకులు

చాగలమర్రి, జనవరి 14: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు రమణారెడ్డి, డి.బాషా అన్నారు. ఆదివారం ముత్యాలపాడు గ్రామంలోని 273, 274 బూత్ పరిధిలో ఆదివారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. సూపర్-6 పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని అన్నారు. టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి కానుకలు అందించారని, అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి పేదల కడుపు కొట్టిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, తిరుపతి, కాశయ్య, చాంద్‌బాష, పాములేటి, ఓబులేసు, ప్రహ్లాదుడు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, జనవరి 14: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమైందని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన వైసీపీకి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీసీలకు కార్పొరేషన్‌లు, సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీల కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఆర్థిక ఇబ్బందులు కలుగచేసిందని అన్నారు. బ్యాంకుల ద్వార రుణ సౌకర్యం కల్పించక పోవడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

'జీవో 512ను రద్దు చేయాలి'


జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్(రూరల్), జనవరి 14: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన జీవో 512ను రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గుత్తి రోడ్డులో సీపీఐ ఆధ్వర్యంలో జీవో ప్రతులనను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజల పాలిట శాపంగా మారుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మోటరాముడు, మండల కార్యదర్శి పులిశేఖర్, అనుబంధ సంఘాల నాయకులు పుల్లయ్య, అబ్బాస్, రణత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

బేతంచెర్ల, జనవరి 14: పట్టణ శివారులోని అయ్యలచెరువు ప్రాంతంలో ఉన్న నిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం ఉపాధ్యాయురాలు భ్రమరాంబ, సూర్యనారాయణ దంపతులు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు జక్రియ, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి వెలుగు: సుబ్బారెడ్డి


డోన్‌లో ప్రతులను దహనం చేస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

డోన్, జనవరి 14: వైసీపీ విధ్వంస విధానాలతో ప్రజలకు వచ్చిన కీడు తొలగిపోయి టీడీపీ అధికారంలోకి రాకతో రాష్ట్రం వెలగాలని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో వివిధ జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. డోన్ నియోజకవర్గ టీడీపీ సలహాదారుల కమిటీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, అభిరెడ్డిపల్లె గోవిందు, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదుట వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక జీవోల ప్రతులను భోగి మంటల్లో కాల్చివేశారు. నాయకులు చిన్నసుంకయ్య, గండికోట రామసుబ్బయ్య, కలచట్ల ప్రసాద్, మల్లికార్జున, ఏనుగమర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: నియంత పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదుట ప్రజా వ్యతిరేక జీవోల ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. నాయకులు మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, ఉన్నం సుధాకర్, తిరుమలేష్ చౌదరి, జాకీరుల్లా భేగ్, రవీంద్ర నాయక్, నారాయణస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.


ప్యాపిలిలో..


బేతంచెర్లలో..

ఘనంగా భోగి


రుద్రవరం: కొండమాయపల్లెలో వేషధారణ


చాగలమర్రి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద భోగి మంట

ఆళ్లగడ్డ, జనవరి 14: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఆదివారం భోగి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆళ్లగడ్డలో మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి ముందు భోగి మంటలు వేసి పాత వస్తువులను కాల్చి వేశారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. పట్టణంలోని ఆచారి కాలనీలో కాళికామాత ఆలయ కమిటీ మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పట్టణ సీఐ రమేష్‌బాబు, అమీర్‌బాషా, గంగన్న, దురగడ్డ రవీంద్రాచారి, అనురాధ, రామాచారి తదితరులు పాల్గొన్నారు

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, కోదండ రామాలయం, మల్లెం వీధిలో బోగిమంటలు వేశారు. మహిళలు బోగిమంటల వద్ద కోలాట నృత్యం చేశారు. గృహాల ముందు రంగు రంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు.

● నంద్యాల మండలం పొన్నాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు వివిధ వేషధారణల్లో కొండమాయపల్లె గ్రామంలో సందడి చేశారు. శూర్పణఖ, శ్రీరాముని వేషధారణలో గ్రామంలో సందడి చేశారు.

బనగానపల్లె: యాగంటిపల్లెలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

● మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులతో పాటు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలో భోగి వేడుకలను ఘనంగాజరుపుకున్నారు. వాడవాడల్లో మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు.

సంజామల: పేరుసోముల గ్రామంలో ముగ్గుల పోటీలను శ్రీవిద్య ఇంగ్లీషు మీడియం హెచ్‌ఎం చెన్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఎంపీడీవో నాగకుమార్, మానవతా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ నాగరాజు శ్రీనివాసచార్యుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

బేతంచెర్ల: మండలంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు సంక్రాంతి పండుగ రంగు రంగుల రంగవల్లి ముగ్గులు వేశారు.

ఘనంగా బీసీ రాజారెడ్డి జన్మదినం


బనగానపల్లెలో వేడుకలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జనవరి 14: పట్టణంలోని పాతబస్టాండ్‌లో బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం జరుపుకున్నారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్‌సీనాగిరెడ్డి, బాలిరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు మల్లారెడ్డి, కైప ఫక్కీర్‌రెడ్డి యాగంటిపల్లె దస్తగిరి, లాయర్ నాగేంద్రరెడ్డి, ఖాదర్‌బాషా, బత్తులూరుపాడు రామచంద్రారెడ్డి, బచ్చు భాస్కర్, ప్రసాద్, కామేశ్ , షేక్షావలి, కోడి నాగశేషులు, జోలాపురం హరి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

బనగానపల్లె, జనవరి 14: మండలంలోని మిట్టపల్లె గ్రామంలో రామజన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గత పదిరోజులనుంచి పూజలు భజన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పంపిణీ చేశారు. శివనాగిరెడ్డి మాట్లాడుతూ ఈనెల22న అయోఒధ్యలో ప్రజల ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుడు కొలవుతీరుతిన్నందున వీటిని ప్రతి ఇంటికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

రుద్రవరం, జనవరి 14: మండలంలోని నరసాపురం గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి, గోదాదేవి కల్యాణోత్సవాన్ని వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా నిర్వహించారు. ధనుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలో చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన పీఠాధిపతులు, వేద పండితుల ఆధ్వర్యంలో చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవాన్ని ఉభయదారులు గాజుల నరసింహులు, లక్ష్మీదేవమ్మ కుమారులు ప్రసాద్, కుమార్ దంపతులతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. కోలాట నృత్య కళాకారుల సాంస్కృతిక కార్యక్రమ ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలి'

డోన్(రూరల్), జనవరి 14: యువత స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలని డోన్ పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని వినియోగదారుల రక్షణ సంఘం ఆధ్వర్యంలో సభ్యుడు పట్టణ ఎస్ఐకి వివేకానంద చిత్రపటాన్ని బహూకరించారు. వినియోగదారుల రక్షణ సంఘం తాలుకా అధ్యక్షుడు ఏతం నాగరాజు, సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

డోన్, జనవరి 14: పట్టణంలోని కనపకుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాకలి మల్లి మృతికి ఆ పార్టీ నాయకులు ధర్మవరం చిన్ననాగిరెడ్డి, ధర్మవరం గౌతమ్ రెడ్డి ఆదివారం సంతాపం తెలిపారు. మల్లి భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.